## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో మస్తాన్‌వలి ఉరుసు



ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

**పాములపాడు:** మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మస్తాన్‌వలి స్వామి ఉరుసు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన కవాలి భక్తులను ఆకట్టుకుంది.

### పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**కొత్తపల్లి:** మండలంలోని ముసలిమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీఓ మేరి తనిఖీ చేశారు. వీరి వెంట ఆర్‌ఐ జహంగీర్ బాషా, వీఆర్వోలు రామసుబ్బయ్య, బాబుమియ్య ఉన్నారు.

### అలరించిన నృత్యప్రదర్శన



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలో కడపకు చెందిన సాయి నటరాజ డాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. మూషికవాహన, నర్తన గణపతిం, లింగాష్టకం, బో..శంభో, ఓంకారం, ఓం నమఃశివాయ తదితర గీతాలకు అలివేలుమంగ, సుజిత, శిరీష, చిన్న, అరవింద్ తేజ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు. రెండవ కార్యక్రమంలో భాగంగా మైదుకూరుకు చెందిన వై.నాగరాజు, బృందం హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ముమ్మరంగా శనగల కొనుగోళ్లు



తర్తూరులో శనగలను కాటా వేస్తున్న హమాలీలు

**జూపాడుబంగ్లా:** మండలంలోని పారుమంచాల, తర్తూరు గ్రామాల్లో ముమ్మరంగా శనగల కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. మండలం వ్యాప్తంగా రబీలో పారుమంచాల, తర్తూరు, మండ్లెం, తంగడంచ, తరిగోపుల, పి.లింగాపురం, తాటిపాడు, తదితర గ్రామాల పరిధిలో 2,850 హెక్టార్లలో శనగ పంటను సాగుచేశారు. 85 శాతం మేర ఈక్రాప్ బుకింగ్ చేయించుకున్నారు. ఈ ఏడాది శనగలకు ప్రభుత్వం రూ.5,335ల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తోంది. ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకున్న రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి కాటా వేస్తున్నారు. ఆ తర్వాత గోదాములకు తరలించి రైతు ఖాతాలకు నగదు జమ చేస్తామని సొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడు తెలిపారు.

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**పాములపాడు:** ఆర్బీకేల్లో జొన్న, పసుపు, మొక్కజొన్న దిగుబడుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రఘురామిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. జింకు, బోరాన్ తదితర సూక్ష్మ పోషకాలను రైతులకు రాయితీపై ఇచ్చేందుకు అందుబాటులో ఉంచాలని సభ్యులు కోరారు. మద్దూరు, వాడాల, పాములపాడు, మిట్టకందాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన జొన్న, శనగ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి సూచించారు. సమావేశంలో పశు వైద్యాధికారి భాస్కర్, సెరికల్చర్ అధికారి విజయ్‌కుమార్, ఏఈఓ మద్దిలేటి పాల్గొన్నారు.

### పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బస్సు సర్వీసు

**జూపాడుబంగ్లా:** ఈనెల 15 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు జూపాడుబంగ్లా మోడల్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు రమేష్, రాజు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తమ పాఠశాలల నుంచి విద్యార్థులు నందికొట్కూరులోని పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# మహిళల జీవితాల్లో వెలుగులు

మహిళల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్‌చేయూత, వైఎస్సార్ ఆసరా, పింఛన్ తదితర పథకాలను సద్వినియోతం చేసుకుంటూ మహిళలు జీవనోపాధులు మెరుగుపరుచుకుంటూ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తున్నారు. పథకాల ద్వారా వచ్చే నగదుతో పాటు ప్రభుత్వం బ్యాంక్ రుణాలు ఇప్పిస్తుండటంతో కిరాణం కొట్టు, చీరల వ్యాపారం, తిరుబండారాల తయారీ, బర్రెలు, పొట్టేళ్ల పెంపకం చేపడుతూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.



మూడోవిడత వైఎస్సార్ చేయూత మెగా చెక్కును అక్కా, చెల్లెమ్మలకు అందిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నియోజకవర్గంలో వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ధి పొందిన మహిళల వివరాలు

| మండలం | లబ్ధిదారుల సంఖ్య | మంజూరైన మొత్తం |
|---|---|---|
| జూపాడుబంగ్లా | 2,435 | రూ.4,56,56,250 |
| కొత్తపల్లి | 1,699 | రూ.3,18,56,250 |
| మిడుతూరు | 2,561 | రూ.4,80,18,750 |
| నందికొట్కూరు రూరల్ | 2,554 | రూ.4,78,87,500 |
| నందికొట్కూరు పట్టణం | 2,773 | రూ.5,19,93,750 |
| పగిడ్యాల | 2,200 | రూ.4,12,50,000 |
| పాములపాడు | 2,520 | రూ.4,72,50,000 |

- వైఎస్సార్ చేయూతతో అక్కాచెల్లెమ్మలకు ఉపాధి
- ఏటా రూ.18,750ల చొప్పున మూడేళ్లకు రూ.56,250లు అందజేత
- కిరాణం కొట్లు, చీరల వ్యాపారం, కుట్టుమిషన్లతో రాణిస్తున్న మహిళలు

**జూపాడుబంగ్లా:** ఆర్థికస్వావలంబన దిశగా అక్కా, చెల్లెమ్మలను అడుగులు వేయించాలనే తలంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కా, చెల్లెమ్మలకు ఏటా రూ.18,750ల నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తూ జీవనోపాధికి అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఆర్థికలోటు బడ్జెట్ ఉన్నా, కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా అక్కా, చెల్లెమ్మలకు ఇచ్చే చేయూతను ఆపలేదు. ఏడాదికి రూ.18,750ల చొప్పున మూడేళ్ల కాలానికి రూ.56,250ల నగదును ఒక్కో మహిళ ఖాతాలో జమచేశారు. చేయూత నిధులను వెచ్చించి మహిళలు కిరాణంకొట్టు, చీరలవ్యాపారం, తినుబండారాల వ్యాపారాలతో పాటు బర్రెలు, పొట్టేళ్ల పెంపకం చేపట్టి జీవనోపాధులు పెరుగుపరుచుకుని కుటుంబాలతో ఆనందంగా గడుపుతున్నారు.

### చీరల వ్యాపారం పెట్టుకున్నా



నేను రెండేళ్ల క్రితం వరకు పొలం పనులకు వెళ్లేదాన్ని. రోజుకు రూ.200 కూలీ ఇచ్చేవారు. వయస్సు పైబడటంతో పొలం పనులు చేతకావటం లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ చేయూత పథకంతో పాటు పొదుపు సంఘంలో తీసుకున్న రుణంతో ఇంటి వద్ద చీరల వ్యాపారం ప్రారంభించాను. మొదట్లో రూ.30 వేలతో వ్యాపారం ప్రారంభించి క్రమేణా రూ.60వేలకు పెంచుకున్నాను. బ్యాంకు రుణాలు, పొదుపు రుణాలు తీసుకొని రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి వ్యాపారం చేసుకుంటున్నాను. ఎంతలేదన్నా రోజుకు రూ.500ల వస్తుంది.

– లక్ష్మీదేవి, మండ్లెం

### కిరాణం కొట్టుతో ఉపాధి పొందుతున్నా



నేను కొంత వరకు చదువుకున్నాను. పొలం పనులకు వెళ్లటం చేతకాదు. ఇంటివద్దే ఉంటూ ఇంటిపనులు చూసుకుంటుంటాను. జగనన్న సీఎం అయ్యాక ఆయన అమలుచేసిన పథకాలతో పాటు మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి వైఎస్సార్ చేయూత పథకం లభించింది. తద్వారా వచ్చిన నగదుతోపాటు పొదుపులో, బ్యాంకులో కొంత రుణం తీసుకొని ఇంటివద్ద కిరాణం కొట్టు పెట్టుకున్నాను. కిరాణం కొట్టు నిర్వహణ వల్ల ఖర్చులు పోనూ రోజుకు రూ.500ల ఆదాయం వస్తుంది.

– నాగేశమ్మ, పారుమంచాల

### కుటుంబ పోషణలో మహిళలు



ప్రభుత్వం పథకాలు వినియోగించుకుని చాలా మంది మహిళలు కుటుంబ పోషణలో కీలకమవుతున్నారు. ఇప్పటికే పలువురు మహిళలు చీరలవ్యాపారం, కిరాణంకొట్టు, టీకొట్టు, బేకరీ వ్యాపారం, చిరుతిండ్ల తయారీ, కుట్టుమిషన్లు, అల్లికలు, ఫ్యాన్సీ స్టోర్ వంటి వ్యాపారాలు చేస్తూ కుటుంబ పోషణలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

– అంబమ్మ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథకం

### రైతులకు సేవలు అందించాలి

**కొత్తపల్లి:** రైతులకు ఆర్బీకేల ద్వారా సేవలు అందించాలని వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, వ్యవసాయ పనిముట్లు, రసాయన మందులు, ఎరువులు ఇతరత్రా వాటి గురించి రైతులకు తెలియజేయాలన్నారు.

### సారా విక్రేత అరెస్ట్

**మిడుతూరు:** మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో ఇంటి వద్ద సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ హనుమంతు తెలిపిన వివరాలు.. నాగలూటి గ్రామానికి చెందిన వడ్డె మునెమ్మ ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని మహిళను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

### పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

**మిడుతూరు:** మండలంలోని 5 గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ ఎన్నికలు నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లో గుర్తించిన పోలింగ్ కేంద్రాల జాబితాను శుక్రవారం ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి విడుదల చేశారు. మిడుతూరు 13వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ ప్రాథమిక రెగ్యులర్ పాఠశాల, వీపనగండ్ల 3వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని అంగన్‌వాడీ కేంద్రం- 2లో, అలగనూరు 10వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని పాత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నాల్గవ తరగతి గది, జలకనూరు 8వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మూడో తరగతి గది, పైపాలెం 5 వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాత నాల్గవ తరగతి గదిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది:** మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్య శర్మ, అర్చకులు.. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో కొలువుంచి హారతి, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని పూజలు చేపట్టారు.

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి చర్యలు

**జూపాడుబంగ్లా:** బాలబాలికలు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని పారుమంచాల డాక్టర్లు యశశ్విని, మౌనిక తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పారుమంచాల పీహెచ్‌సీ పరిధిలో 2,534 మంది బాలబాలికలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి నులిపురుగుల నివారణ వారోత్సవాల్లో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

– మిడుతూరు: ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ మౌలాలి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ కిరణ్ కుమార్, ఎంఈఓ మౌలాలి ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు.

– కొత్తపల్లి: చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు కృషిచేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. అనంతరం వైద్యులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వాటిని పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ఇళ్లలోని పిల్లలకు కూడా పంపిణీ చేసి వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో వైద్యులు దీపానాగవేణి, జబ్బీర్, జూబేదా, విజయేంద్ర, ఎంఈఓ శ్రీరాములు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఆల్‌బెండజోల్ మాత్రలను వైద్యులకు అందిస్తున్న ఎంపీడీఓ మేరి

## వడ దెబ్బ, వైరల్ ఫీవర్‌పై అప్రమత్తంగా ఉండండి

**నంద్యాల:** అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో వడదెబ్బ, వైరల్ ఫీవర్ తదితర సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుంచి ఆరోగ్యం, శిశు సంక్షేమం, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ తదితర ప్రభుత్వ పథకాల అభివృద్ధి లక్ష్యాలు, గ్రామ వార్డు సచివాలయాలు, స్పందన అర్జీల పరిష్కారం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, అధికారులు పాల్గొన్నారు. జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయాంజ వైరస్, వడదెబ్బ తీవ్రతపై కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన సూచనల మేరకు అన్ని జిల్లాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్షణం వారం రోజుల పాటు ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. వడదెబ్బకు గురి కాకుండా ప్రజల్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓలకు కలెక్టర్లు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రజలు బయట తిరగకుండా హెచ్చరికలు జారీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు సూచించారు. మార్చి 15వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అదే రోజు ఒక విలేజ్ క్లినిక్ వద్ద ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణకు సూచించారు. పాఠశాలల్లో రక్తహీనత గల విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం వినియోగించుకునేలా, చర్యలు తీసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేయాలని డీఈఓ అనురాధను ఆదేశించారు. కార్యశిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

### కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

**నంద్యాల(వ్యవసాయం):** గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



### త్వరలో సరిహద్దు రాళ్లు ఏర్పాటు

**జూపాడుబంగ్లా:** సమగ్ర భూసర్వే పైలెట్‌ప్రాజెక్టు కింద ఎంపికైన పి.లింగాపురం గ్రామ పరిధిలో త్వరలో భూసరిహద్దు రాళ్లను ఏర్పాటుచేయనున్నట్లు తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం పి.లింగాపురంలో రైతులతో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 363 మంది రైతులకు గానూ 311 మంది రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందజేశామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు. పాసుపుస్తకాలు అందజేసిన రైతుల పొలాల సరిహద్దులను సూచిస్తూ నాలుగువైపులా త్వరలో రాళ్లు పాతిస్తామన్నారు.

### 21 నుంచి విద్యార్థులకు రాగి జావా

**పగిడ్యాల:** ఈనెల 21వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావా అందించనున్నట్లు మండల విద్యాధికారి సుభాన్ తెలిపారు. శుక్రవారం ఆయన బీరవోలు మండల పరిషత్ ప్రాథమిక, జిల్లాపరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో భాగంగా ఇప్పటికే పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. కొత్తగా మెనూలో రాజి జావాను చేర్చినట్లు చెప్పారు.

### పాత నేరస్తుల కదలికలపై నిఘా

**మహానంది:** నంద్యాల, బండిఆత్మకూరు మండలాల్లో గంజాయి ముఠా గుట్టురట్టవడంతో మహానంది పోలీసులు పాత నేరస్తుల కదలికలపై ఆరా తీస్తున్నారు. గతంలో మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన కొందరు రైళ్లలో గంజాయి తీసుకొస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పోలీసులు 18 మందిని అరెస్ట్ చేసి సుమారు నలభై కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయా లేదా అంటూ పలువురిని విచారించినట్లు సమాచారం.

## సావిత్రీ బాయి పూలేకు ఘన నివాళి

**నందికొట్కూరు:** పట్టణంలోని విజ్‌డమ్ కంప్యూటర్ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రీబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి, నాయకులు ఆంజనేయులు, రాముడు, శ్రీనివాసులు, యుగంధర్, బాషా, గోపాలకృష్ణ, బాబు, స్వామినాయుడు, సోమశేఖర్, తదితరులు పాల్గొని సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

● **పాములపాడు:** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. నాయకులు స్వామన్న, షర్ఫుద్దీన్‌అలీ, అబ్రహాం, మురళి, బతుకులయ్య తదితరులు పాల్గొని సావిత్రీ బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నందికొట్కూరులో సావిత్రీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహా క్షేత్రంలోని భ్రమరాంబా దేవికి ఆలయ అధికారులు శుక్రవారం కొబ్బరి కాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరి కాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాదికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించారు. ఏప్రిల్ 11న జరిగే కుంభోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సాత్వికబలిగా కొబ్బరికాయలు సమర్పిస్తారు. అలాగే కుంభోత్సవం రోజు స్త్రీ వేషధారణలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరిదాసు, పర్యవేక్షకులు స్వాములు, ఆలయ ఉద్యోగి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు

## పది రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**నంద్యాల(సిటీ):** నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల (ఎన్‌పీఏ) నిర్మాణాలు పది రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ) వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని సచివాలయ అమెనిటీస్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈఈ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు నిరీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. 384 గృహాల్లో కేవలం 288 గృహాల నిర్మాణాలు పూర్తి చేశారని, పెండింగ్‌లో ఉన్న 96 గృహాలను పది రోజుల్లో పూర్తి చేయకపోతే అమెనిటీస్ సెక్రటరీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హౌసింగ్ ఏఈ రాజ రఘువర్మ, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సికిందర్, శోభారాణి, జయంత్, నాగరాజు పాల్గొన్నారు.

**గైర్హాజైన వారికి షోకాజ్ నోటీసులు..**


సమావేశానికి గైర్హాజరైన ఆరుగురు అమెనిటీస్ సెక్రటరీలకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు షోకాజు నోటీసులు జారీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విధుల్లో అలసత్వం చూపినందున అమెనిటీస్ సెక్రటరీలకు షోకాజు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

# విచ్చలవిడిగా వెంచర్లు..

- ప్లాట్లు కొంటే కార్లు, బైక్‌లు బహుమతిగా ఇస్తామంటూ ప్రకటనలు
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు



రోడ్లు వేసినట్లుగా వెంచర్ లేఅవుట్‌ను చూపిస్తూ ప్లాట్లు విక్రయిస్తున్న నిర్వాహకులు



కనీస వసతుల్లేకుండా విక్రయిస్తున్న ప్లాట్లు

**జూపాడుబంగ్లా:** 'మా వెంచర్లో ప్లాటు కొంటే కార్లు, బైక్‌లు బహుమతిగా ఇస్తాం' అంటూ నమ్మబలుకుతూ కనీస సౌకర్యాల్లేని వెంచర్‌లో ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ముచేసుకొంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో కేజీ రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ వేశారు. పెద్ద ఫ్లెక్సీ వేసి మరీ ప్లాట్లు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంచర్లు ఏర్పాటుచేసి ప్లాట్లు విక్రయించే విషయమై ప్రభుత్వం జీవో నంబర్ 145ను విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారంగా ఎకరా పొలంలో వెంచర్ ఏర్పాటుచేస్తే అందులో 5 శాతం మేర స్థలాన్ని ప్రభుత్వానికి కేటాయించాలి. లేదా దానికి విలువైన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. అంతకుముందు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు తహసీల్దార్ ద్వారా ఆర్డీఓ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అలాగే కర్నూలు రూరల్ డెవలప్‌మెంట్ అధికారుల వద్ద లేఅవుట్ అప్రూవల్ తీసుకుని వెంచర్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. తప్పనిసరిగా నిబంధనలను అనుసరించి 40 అడుగుల మేర రోడ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కనీసం రోడ్లు, తాగునీరులాంటి కనీస వసతుల్లేకుండా, కుడా అనుమతుల్లేకుండా వెంచర్లు ఏర్పాటుచేసి ప్లాట్లు విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ప్లాట్ల విక్రయిస్తున్నట్లు కేజీ రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన బోర్డు

### మా పరిధి కాదు

తంగడంచ వద్ద కేజీరోడ్డు పక్కన ఏర్పాటుచేసిన వెంచర్ కుడా పరిధిలోకి వస్తుందని మేం పట్టించుకోలేదు. కుడా అధికారులు పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అనేది వారే తేల్చాలి.

– మణిమంజరి, ఈఓపీఆర్డీ, జూపాడుబంగ్లా